వారము కామనియుఁ గావుననే మా కవిత యాచంద్రార్కము భాషకు సాహాయ్య మొనరింపఁగలదనియు మా చదువరులతో విన్నవించుకొను చున్నారము.

పత్రికాధిపతులు.

# న్యాయ చంద్రిక.

### ఆకాశ ముష్టి హనన న్యాయము.

ఆకసమును బిడికిళ్ళతోఁ బొడిచిన నేమియు ఫలములేదు. అట్లే ప్రతిపాద్యమగు విషయము లేకయే యుక్తులు చెప్పినఁ బ్రయోజనములేదు.

### కూపయంత్ర ఘటికా న్యాయము.

నూతికమర్చిన యేతాముగడె క్రమానుకప్పుడడుగంటును. వేఱొకప్పుడు మిన్నుముట్టును. అట్లే జనులు పర్యాయముగ హానివృద్ధులఁ జెందుచుండును.

### పంకప్రక్షాళన న్యాయము

అడుసుఁ ద్రొక్కి పిదపఁ గాళ్లుగడుగుకొనుటకన్న దూరముగాఁ దొలఁగి చనుట మంచిది. అట్లే ముందుగాఁ బాపకార్యమొనరించి తరువాతఁ బ్రాయశ్చిత్తమొనరించుకొనుటకన్న ముందే సన్మార్గమునఁ బ్రవర్తించుట శ్రేయము.

### పిష్టపేషణ న్యాయము.

పిండిని మఱల నూఱనక్కఱలేదు. అట్లే చెప్పినవిషయమును మఱలఁ జెప్పుట యనుచితము.

### ప్రధానమల్ల నిబర్హణ న్యాయము.

పేరుగల జెట్టిని గెలిచినచోఁ దక్కిన మల్లులందఱు పరాజితులే యగుదురు. అట్లే ప్రధానమగు యుక్తిని ఖండింపఁ దక్కిన వాదములన్నియు నిరాకృతములే యగును.